సమాచారం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కీసర: యాద్గార్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో 33/11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని కీసర విద్యుత్ ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని చీర్యాల, యాద్గార్‌పల్లి, నర్సంపల్లి, తిమ్మాయిపల్లి, ధర్మారం గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఏఈ విజ్ఞప్తి చేశారు.

చక్రిపురం సబ్‌స్టేషన్ పరిధిలో...

చక్రిపురం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని నాగారం మున్సిపాలిటీ శిల్పానగర్, సింహపురి, విజయపురి, ఎస్‌వీ నగర్, సాయినగర్, తారపురికాలనీ, వికాస్‌నగర్, వెంకట్‌రెడ్డినగర్, దేవరకొండ కాలనీ, ఎంఎస్ కాలనీ, బ్రహ్మయ్య కాలనీ, ఈశ్వర్‌పురి, లక్ష్మీనగర్, మధురానగర్, రేణుకా ఎల్లమ్మ కాలనీ, పీఎంఆర్ కాలనీ, బాబురెడ్డినగర్ కాలనీల్లో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో ఉండదని, వినియోదారులు సహకరించాలని ఏఈ కామేశ్వరరావు కోరారు.

నేడు గట్టుమైసమ్మ జాతర



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న చైర్‌పర్సన్ పావనీయాదవ్, వైస్‌చైర్మన్ మాధవరెడ్డి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ ప్రజల ఆరాధ్య దైవం శ్రీఘట్టు మైసమ్మ అమ్మవారి జాతరకు ఆలయం ముస్తాబైంది. ప్రజలు అత్యంత భక్తశ్రద్ధలతో జరుపుకునే ఈ జాతర ఆదివారం జరుగనుంది. పుష్య మాసంలో మకర సంక్రాంతి తర్వాత వచ్చే మొదటి ఆదివారం రోజున జాతరను జరుపుకోవడం ఆనవాయితీ. జాతరకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏసీపీ, ఐదుగురు సీఐలు, 20 మంది ఎస్సైలతో పాటు 120 మంది పోలీసులు పర్యవేక్షించనున్నారు. మహిళల కోసం బయో టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని చైర్‌పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి ఆదేశించగా కమిషనర్ వేమనరెడ్డి, కౌన్సిలర్ ఆంజనేయులుగౌడ్, ఈఓ భాగ్యలక్ష్మీ, ఎఫ్‌ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, మాధవరెడ్డి, ప్రణయ్‌రెడ్డి పనులు శనివారం పర్యవేక్షించారు.

నేడు మంత్రి, ఎమ్మెల్సీ రాక

జవహర్‌నగర్: తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేవారత్న అవార్డు గ్రహీత అనిల్‌కుమార్ సన్మాన సభకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీ బండ ప్రకాశ్‌లతో పాటు ఇతర ప్రముఖులు హాజరుకానున్నట్లు ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు కృపాసాగర్ ముదిరాజ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదివారం అంబేడ్కర్ నగర్‌లోని రోజ్ గార్డెన్‌లో నిర్వహించే ఈ సభకు జిల్లాలోని ముదిరాజ్ సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు కుట్టు మెషిన్ కేంద్రం ప్రారంభం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని అరుంధతినగర్‌లో గుడ్‌విల్ స్పోర్ట్స్ వేర్‌ను ప్రారంభించేందుకు హైదకాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (అడ్మిన్) జె.పరిమిళ హన నూతన్ హాజరుకానున్నట్లు నిర్వాహకురాలు కె.ఇందిర రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కుట్టు మెషిన్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, స్థానిక మహిళలు హాజరు కావాలని ఆమె కోరారు.

క్లుప్తంగా

బారికేడ్ల అందజేత



శామీర్‌పేట్: ప్రతీ ఒక్కరూ రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని శామీర్‌పేట సీఐ సుధీర్‌కుమార్ అన్నారు. బేగంపేటకు చెందిన మెడికొవర్ హాస్పిటల్ యాజమాన్యం ఆధ్వర్యంలో శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌కు 50 బారికేడ్లను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఎస్సైలు రవికుమార్, మునీందర్, అనిత, మెడికవర్ ఇంచార్జ్ డాక్టర్ రిషికేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటారు ప్రారంభం



ఘట్‌కేసర్: కాచవానిసింగారం గ్రామంలో నూతన బోరు మోటారును శనివారం ఉప సర్పంచ్ గీతతో కలిసి సర్పంచ్ వెంకట్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు మట్ట విష్ణుగౌడ్, పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, ముత్యాలు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వసతులతో | కంటి వెలుగు శిబిరాలు నిర్వహిస్తున్నాం

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్‌తో కలెక్టర్ హరీశ్



వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ హరీశ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: కంటి వెలుగు నిర్వహణకు జిల్లాలో 79 శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షల కోసం వచ్చే వారికి తాగునీరు, షామియానాలు, కుర్చీలు వంటి అన్ని సౌకర్యాలను కల్పించినట్లు కలెక్టర్ హరీశ్ తెలిపారు. పరీక్షలకు వచ్చే వారి వివరాలను నమోదు, డాటా ఎంట్రీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శనివారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ శాంతి కుమారి, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వి, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేతతో ఆయన మాట్లాడారు. కంటి పరీక్ష చేయించుకున్న వారికి అవసరాన్ని బట్టి రీడింగ్ గ్లాసులు, ప్రిస్క్రిప్షన్ కళ్లద్దాలను అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. వైద్య, పోలీసు, సంబంధిత శాఖల సమన్వయంతో కంటి వెలుగు శిబిరాల నిర్వహణకు, జిల్లాలో ఏర్పాటు చేసిన ప్రతి శిబిరాన్ని పర్యవేక్షిస్తూ సమయపాలన పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ప్రతి సోమవారం నుంచి శుక్రవారం వరకు క్యాంపులు జరుగుతాయని, శని ఆదివారాల్లో క్యాంపులు ఉండవని సీఎస్ శాంతి కుమారి తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

శిబిరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి : కలెక్టర్ హరీశ్

కంటి వెలుగు క్యాంపు నిర్వహణ సమయంలో పక్కాగా ట్యాబ్ ఎంట్రీ వివరాలు నమోదు చేయాలని, నిత్యం ట్యాబ్ ఎంట్రీ పర్యవేక్షిణ ఖచ్చితంగా జరగాలని కలెక్టర్ హరీశ్ జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలో క్వాలిటీ కంట్రోల్ బృందాల ద్వారా ప్రతి రోజూ ఫీడ్ బ్యాక్ తీసుకుని లోటుపాట్లను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. శిబిరానికి వచ్చిన వారు సంతృప్తి చెందేలా నాణ్యతతో కూడిన పరీక్షలు చేసి కంటి అద్దాలు ఇవ్వాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆన్‌లైన్ డేటా నమోదు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, ఏమైనా సమస్యలుంటే అధికారులు నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ ఆనంద్, క్యాంప్ మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ఆప్టోమెట్రిస్టులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరీశ్

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి

ఘట్‌కేసర్: కంటి వెలుగు ద్వారా ఉచితంగా నిర్వహించే కంటి పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వేమనరెడ్డి అన్నారు. ఎన్ఎఫ్‌సీనగర్ కంటి వెలుగు కేంద్రాన్ని స్థానిక కౌన్సిలర్ వెంకట్‌రెడ్డితో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఇందులో భాగంగా 105 మందికి కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు 35 మందికి కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ శోభన, వైద్యనిపుణులు శిరీష, డీఈఓ సాత్విక్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



కళ్లద్దాలు అందజేస్తున్న కమిషనర్ వేమనరెడ్డి, కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి

విద్యార్థుల చదువులపై బాధ్యతగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ హంసరాణి

మేడ్చల్: పిల్లలు చదువుల్లో రాణించి ఉజ్వల భవిష్యత్ సాధించాలంటే వారిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమాన బాధ్యతగా చూడాలని కండ్లకోయ కౌన్సిలర్ హంసకృష్ణగౌడ్ అన్నారు. కండ్లకోయ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్, టీచర్ కమిటీ సమావేశం నిర్వహించగా ఆమె పాల్గొని మాట్లాడారు.

వర్గీకరణ కోసం వినతి

మేడ్చల్: ఎస్సీ వర్గీకరణ కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రంరెడ్డిని ఆయన నివాసంలో కలిసిన ఎమ్మార్పీఎస్ నేతలు వినతి పత్రం సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పినా అమలు చేయలేదని, హామీని వెంటనే నెరవేర్చేలా ఒత్తిడి తీసుకరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, భానుచందర్, పరుశరాం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ప్రభుత్వ భూమిని కాపాడాలని తహసీల్దార్‌కు వినతి



ప్రభుత్వ స్థలంలో మట్టి పోసిన వ్యాపారులు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లిలో ప్రభుత్వంకు చెందిన కాందీశీకుల భూమిని కొందరు వ్యాపారులు కబ్జా చేస్తున్నారని మున్సిపల్ బీజేపీ నాయకుడు జాకట ప్రేందాస్ అన్నాడు. కబ్జాకు గురవుతున్న భూమిని కాపాడాలని కోరుతూ బీజేపీ నాయకులతో కలిసి తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్వెల్లిలోని బుడమకుంట దగ్గర గల సర్వే నంబర్.307లో గల కాందీశీకుల భూమిలో మట్టి పోసి కబ్జా చేస్తున్నారని రెవెన్యూ అధికారులు తగు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేష్, ఈశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, ఎల్లం, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

పెన్షనర్ల డైరీ ఆవిష్కరణ

మేడ్చల్: ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ డైరీని మేడ్చల్ సబ్ ట్రెజరరీ కార్యాలయంలో అధికారులు, పెన్షనర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెన్షనర్లు మాట్లాడుతూ.. ప్రతి నెల 1న పింఛన్ ఇవ్వాలని, డీఏలను విడుదల చేయాలని, పీఆర్‌సీ కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నర్సింగ్‌రావు, జిల్లా అధ్యక్షుడు బాలమల్లేష్, కార్యదర్శి మూర్తి, శ్రీధర్, మాణిక్‌రావు, ఏటీఓ యాదగిరి, ఎస్‌టీఓ రవిందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై నిర్మించిన గోడ కూల్చివేత



గోడను కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పోచారం: అన్నోజిగూడలోని రాష్ట్రీయ విద్యా కేంద్రం గేటుకు అడ్డుగా రోడ్డుపై కట్టిన గోడను పోచారం మున్సిపల్ సిబ్బంది శనివారం సాయత్రం కూల్చివేశారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును సైతం లెక్క చేయకుండా కబ్జాదారులు కబళించేందుకు చేసిన ప్రయత్నాలకు కూల్చివేతలతో అడ్డుకట్ట వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సురేష్ మాట్లాడుతూ.. రహదారులను కబ్జా చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుడ్ల లోడ్‌తో వెళ్తున్న ఆటోను ఢీ కొట్టిన లారీ

శామీర్‌పేట్: గుడ్ల లోడ్‌తో వెళ్తున్న ట్రాలీ ఆటోను ఓ లారీ ఢీకొట్టిన ఘటన శనివారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు వివరాల ప్రకారం.. మూడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామంలో గల సంగీత్ ఫంక్షన్‌హాల్ మూల మలుపు వద్ద కేశవరం నుంచి జగ్గంగూడ వైపు వెళ్తున్న ట్రాలీ ఆటోను ఎదురుగా అతివేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. దీంతో ఆటో నుజ్జునుజ్జు కాగా ఆటోలో ఉన్న గుడ్లన్నీ రోడ్డు పాలయ్యాయి. అతివేగంతో ఉన్న లారీ పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఆటో నడుపుతున్న వ్యక్తితో పాటు లారీ క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సాయంతో క్షతగాత్రులను 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.



ప్రమాదంలో ధ్వంసమైన ఆటో

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

మేడ్చల్‌రూరల్: చీరతో ఉరి వేసుకుని వ్యక్తి మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మేడ్చల్ పోలీసుల వివరాల ప్రకారం.. మేడ్చల్ మున్సిపాలిటీ అత్వెల్లి లోటస్‌లో నివాసం ఉండే మోర శ్రీలత(33) శనివారం ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కాగా శ్రీలత డిప్రెషన్‌కు లోనై ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని మృతురాలి తండ్రి ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్యూబా సంఘీభావ సభను విజయవంతం చేయండి

జవహర్‌నగర్: హైదరాబాద్ పర్యటన సందర్భంగా ప్రపంచ విప్లవ యోధుడు చే గువేరా కుమార్తె డాక్టర్ అలైదా గువేరా, మనవరాలు ప్రొ.ఎస్తేఫానియా గువేరా ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించే క్యూబా సంఘీభావ సభను విజయవంతం చేయాలని సీపీఐ మాజీ ఎంపీటీసీ తోటపల్లి శంకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం జవహర్‌నగర్‌లో సభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీ యూసీ కాప్రా మండలాధ్యక్షుడు అంబాల ఎల్లయ్య, నాయకులు దర్శనం యాదగిరి, స్వరూప, లక్ష్మణ్, రాజేశ్వరి, మల్లిక, శ్యామల, లత, అంజయ్య, నవీన్, ఖాజాభాయ్, నాయకులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్ వద్ద సీ–1 నుంచి సీ–6 బ్లాక్‌ల వరకు ఉన్న ఫుట్‌పాత్‌పై నిర్వహిస్తున్న చిరు వ్యాపారాలను దూర ప్రాంతాలకు తరలించాలని నిర్వాహకులను మున్సిపల్ అధికార యంత్రాంగం ఆదేశించింది. అటువంటి ప్రదేశాలకు దుకాణాలను తరలిస్తే తీవ్రంగా నష్టపోతామని చిరు వ్యాపారులు వాపోతున్నారు. వీధి వ్యాపారులను కేంద్ర ప్రభుత్వం లోన్లు, డిజిటల్ లావాదేవీలతో ప్రోత్సహిస్తోందని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆదుకోవాలని కోరారు. కాలనీవాసులకు చేరువలో ఉన్న వ్యాపారాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తే నిర్వాహకులతో పాటు కొనుగోలుదారులు ఇబ్బందులు పడతారని, ఇప్పటికే ఏర్పాటు చేసిన దుకాణాలను అలాగే కొనసాగనివ్వాలని విజ్ఞప్తి చేశారు. వ్యాపార నిర్వహణ కారణంగా ట్రాఫిక్ వంటి సమస్యలు వస్తే దుకాణాల సంఖ్య పెరగకుండా చర్యలు తీసుకుంటే కట్టుబడి ఉంటామన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తితే వలంటీర్లను ఏర్పాటు చేసి కంట్రోల్ చేయిస్తామని హామీ ఇచ్చారు.

కేంద్ర ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కీసర: దేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పరిపాలన, విజయాలతో పాటు రాష్ట్రంలో కేసీఆర్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, వైఫల్యాలను ప్రజలకు తెలియజేసే వారధులుగా బీజేపీ బూత్ కమిటీల సభ్యులు పనిచేయాలని ఆ రాష్ట్ర నాయకుడు కొంపల్లి మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు మోర నాగమల్లారెడ్డి ఆధ్వర్యంలో శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే బీజేపీ నాయకులు ప్రజలకు మరింత చేరువకావాలన్నారు. సమావేశంలో బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి, దమ్మాయిగూడ మున్సిపల్ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కొంపల్లి మోహన్‌రెడ్డి తదితరులు

వరదనీటి కాల్వ నిర్మాణం చేపట్టాలని ధర్నా

మద్దతు తెలిపిన తీన్మార్ మల్లన్న

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి చౌరస్తా నుంచి హావీసా రెస్టారెంట్ సమీపంలో గల పెద్ద కప్పు నాలా వరకు డ్రైనేజీతో పాటు వరదనీరు వెళ్లేలా ప్రభుత్వం హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో నాలా పనులు చేపట్టాలని ధర్నా చేపట్టారు. నాగారం మున్సిపాలిటీకి చెందిన ముంపు ప్రాంత కాలనీవాసుల ఆధ్వర్యంలో ఏర్పాటైన టీమ్ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ర్యాలీతో పాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీమ్ జేఏసీ అధ్యక్షుడు జయకుమార్, ఉపాధ్యక్షుడు జగదీశ్వర్, ప్రధానకార్యదర్శి రవీందర్ తదితరులు మాట్లాడుతూ.. ప్రతియేడు వర్షాకాలంలో వర్షాలు కురిసిన సమయంలో పెద్ద ఎత్తున నాగారంపై భాగంలో నుంచి వరదనీరు వచ్చి నాగారం మున్సిపాలిటీ పరిధిలోని బీఎంఆర్, అరవింద్‌నగర్, తీవారి ఎన్‌క్లేవ్, సాయిసంజీవని, బీబీసీ కాలనీ, భాగ్యనగర్, మల్లికార్జున్‌నగర్, అన్నమయ్య, లోటస్, పారామౌంట్, శిల్పావెంచర్ తదితర లోతట్టు కాలనీలన్నీ జలమయమై పోతున్నాయని, వరదలు తగ్గుముఖంపట్టేంత వరకు ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితినెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇటీవల వరదనీరు సాఫీగా పారేలా రాంపల్లి చౌరస్తా నుంచి నాగారం పెద్దకప్పు వరకు నాలా పనులు చేపట్టాలని నిర్ణయించిందన్నారు. కానీ అధికారులు, కొంతమంది మున్సిపల్ పాలకులు ఇట్టి పనులను కాలనీ మధ్య నుంచి సుమారు రూ.40 కోట్ల మేర నిధులు వెచ్చించి చేపట్టాలని చూస్తున్నారని, ఈ నిర్ణయాన్ని వారు ఉపసంహరించుకుని సుమారు రూ.8 కోట్ల నిధులతోనే రాంపల్లి చౌరస్తా నుంచి ప్రధాన రహదారి వెంబడి పెద్దకప్పు వరకు నిర్మించాలని డిమాండ్ చేశారు. కాలనీవాసుల సమస్యను పట్టించుకోకపోతే తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. లోతట్టు కాలనీవాసుల ర్యాలీ, ధర్నాకు తీన్మార్ మల్లన్నతో పాటు ఆయన టీమ్ సభ్యులు, కౌన్సిలర్ వంగ హరిబాబు, మాజీ వార్డు సభ్యులు సాయినాథ్‌గౌడ్, శ్రీకాంత్‌యాదవ్‌లు మద్దతు తెలిపారు.



మద్దతుగా ర్యాలీలో పాల్గొన్న తీన్మార్ మల్లన్న

కమిషనర్‌కు వినతి...



కమిషనర్ వాణీరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

బీఎంఆర్‌కాలనీ నుంచి లోతట్టుకాలనీల మీదుగా కొనసాగిన ర్యాలీ మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని మున్సిపల్ కమిషనర్ వాణీరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కమిషనర్ వాణీరెడ్డిలతో పాటు పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ.. ఇరిగేషన్, హెచ్ఎండీఏ ఇంజినీరింగ్ అధికారులు నాలా పనులు ఎక్కడి నుంచి చేపట్టాలని పూర్తిస్థాయిలో సర్వే చేపట్టిన అనంతరమే నిర్ణయించారన్నారు. అయినప్పటికీ మరోసారి లోతట్టు కాలనీవాసుల డిమాండ్‌ను అధికారులు, మంత్రి మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లి అందరి ఆమోదంతోనే పనులు చేపట్టి సమస్య పరిష్కరించేలా చూస్తామన్నారు.

అభివృద్ధిలో నాగారంను ముందంజలో ఉంచేందుకు చర్యలు



కాలనీలో పర్యటిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీని అభివృద్ధిలో ముందంజలో ఉంచేందుకు చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని నేతాజీనగర్‌కాలనీ రోడ్డు నంబర్.9లో సుమారు రూ.10 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం నేతాజీనగర్‌కాలనీలో పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ వాణీరెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్ బదనపురం శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.

'పేదోడికి 'ధరణి' శాపంగా మారింది'

ఘట్‌కేసర్: ధరణి ఉన్నోడికి వరంగా.. పేదోడికి శాపంగా మారిందని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట భాధితులతో కలిసి ధరణిపై శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. భూసమస్యలపై సర్కారు కార్యాలయాల చుట్టూ తిరిగినా పనులు కాకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అవనీతి అధికారులు, నాయకులకు ధరణి వ్యాపారంగా మారిందన్నారు. మాదారం సర్వే నంబర్.225లో భూములు కోల్పోయిన దళితులకు నాయ్యం జరగడం లేదని, ఒక కుటుంబంలో నలుగురు అన్నదమ్ములుంటే ధరణిలో దరఖాస్తు చేసుకోగా ఒక్కరి పేరే రికార్డులో రావడంతో మిగిలిన ముగ్గురికి అన్యాయం జరుగుతుందన్నారు. అధికారులు స్పందించి ధరణి సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో రైతులతో కలిసి ధర్నా చేపడతామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ప్రతి కాలనీలో వేగంగా అభివృద్ధి పనులు



అంతర్గత డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్ తదితరులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని 21వ డివిజన్‌లో మున్సిపల్ సాధారణ నిధులు రూ.5 లక్షలతో అంతర్గత డ్రైనేజీ పనులను శనివారం కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ప్రతి కాలనీలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు భూమా విజయపాల్, గండి నర్సయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సింగన్న బాలరాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్రకాష్, డివిజన్ అధ్యక్షుడు జక్కుల భాస్కర్, నాయకులు నగేష్, చందు, గణేష్, కృష్ణ, శ్రీనివాస్, ముకుందం, రామ్‌చందర్, కుమార్, రామ్‌నర్సయ్య, శ్రీనివాస్, రాజమౌళి కాలనీవాసులు పాల్గొన్నారు.